జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 9 | జూన్ | 2025 ◆ పేజీలు : 3



# తొలకరి ఆరంభం మృగశిర కార్తె ప్రారంభం

- మృగశిర కార్తె తో చేపలకు ఎగబడ్డ జనం
- రోజువారి అమ్మకం ధర 150 మృగశిర కార్తె అవ్వడం వలన కేజీ చేపల ధర 200 రూపాయలు



**టేకులపల్లి,జూన్08,ప్రజాజ్యోతి :** మృగశిర కార్తెకు ఎలాగైనా చేపలు తినాలి అనేది నానుడి చరిత్ర ఆదివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలలో చెరువులు, వాగులు పై చేపల కోసం జనం ఎగబడ్డారు. ఉదయం 5 గంటల నుండి వివిధ ప్రాంతాల నుండి ఆటోలలో, ట్రాలీల్లో

మిగతా 2 లో...





# కలెక్షన్ ఫుల్... పార్కింగ్ ప్లేస్ నిల్

- రామయ్య దర్శనానికి వచ్చే భక్తులకు పార్కింగ్ కష్టాలు
- రామయ్య కాస్త కనికరించవయ్యా అంటున్న రామ భక్తులు.

**భద్రాచలం టౌన్, జూన్ 8(ప్రజాజ్యోతి):** భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానానికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఎక్కువ శాతం భద్రాచలం వచ్చే భక్తులు రాముడి దర్శనం అనంతరం పర్ణశాల, పాపికొండలు, మారేడుమిల్లి లాంటి ప్రదేశాలు కూడా చూడటానికి ప్లాన్ చేసుకొని వస్తూ ఉంటారు. దీంతో చాలామంది సొంత వాహనం వాడితే మరి కొంతమంది ప్రైవేట్ ట్రావెల్స్ బుక్ చేసుకుని వస్తూ ఉంటారు. ఇక్కడ సమస్యల్ల పార్కింగ్ ఆలయానికి మూడు దిక్కులు ఆసీలు వసూలు చేస్తున్నారు.అయితే గ్రామపంచాయతీ వారు నిర్ణయించిన ధరలు కాకుండా తమ ఇష్టానుసారంగా భక్తుల నుండి ముక్కు పిండి మరి చిన్న కారుకు 50రూ తీసుకోవలసిన



మిగతా 2 లో...



# పేదప్రజల కోసమే ఈ ప్రభుత్వం పని చేస్తుంది

## గిరిజనులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన బియ్యాన్ని అందిస్తాం.. ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, జూన్08, ప్రజాజ్యోతి:** పేద ప్రజలకు కూడు, గూడు కల్పించటమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని కొండరెడ్ల గ్రామం రెడ్డిగూడెంలో ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని రేషన్ దుకాణంలో ఆదివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్నందున ప్రజలకు ఇబ్బంది లేకుండా మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకేసారి ఇస్తున్నామన్నారు. గిరిజనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన బియ్యాన్ని అందజేయాలని ప్రతి కుటుంబానికి సకాలంలోనే అందించేలా ఏర్పాటు చేసుకోవాలని రేషన్ డీలర్ కు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం నడుస్తుందని ప్రతి సంక్షేమ పథకం అర్హులైన అందరికీ చేరేలా మనమంతా బాధ్యత తీసుకోవాలన్నారు. పేదలకు అందుతున్న బియ్యం పై రేషన్ డీలర్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భద్రాద్రి @41.9

2 లో..

# చదువు జీవితాన్ని వెలిగించే దీపం

- గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు
- విశ్రాంత ఉద్యోగుల ప్రోత్సాహం మరువలేనిది
- డి.ఎస్.పి అబ్దుల్లారెహమాన్



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 8, ప్రజాజ్యోతి:** కొత్తగూడెం పట్టణంలో గల జిల్లా గ్రంథాలయం నందు సీనియర్ సిటిజన్స్ విద్యానగర్ కాలనీ వారి ఆధ్వర్యంలో పదివేల రూపాయలు విలువ చేసే సాధారణ వేడి , చల్లని , త్రాగునీరు అందించే వాటర్ కూలర్ ను జిల్లా గ్రంథాలయానికి డి.ఎస్.పి ఆర్ఎస్ రెహమాన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు . ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ చదువు జీవితాలని వెలిగించే చక్కటి దీపం అని, సామాన్య కుటుంబాన్ని సంపన్న కుటుంబం గా తీర్చిదిద్దుతుందని అన్నారు, కష్టపడి, ఇబ్బందులను ఓర్చుకుని మంచిగా చదువుకున్న వారు నేడు ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు, నేటి రోజుల్లో చదువుకునేందుకు ప్రభుత్వాలు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాయని, కనీస మౌలిక సదుపాయాలు లేని రోజుల్లో వీధి దీపాలు కిరోసిన్ లాంతర్ల ముందు

మిగతా 2 లో...

## తొలకరి ఆరంభం మృగశిర కార్తె ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి...)
,బైకుల మీద చేపలను తీసుకువచ్చి రోడ్ల పై పోసి అమ్మకాలు జరుపుతున్నారు. ఒక్కొక్క రకం చేపలు రవ్వలు, బొచ్చలు, కొర్రమేను, పాము చేపలు, రొయ్యలు ఇలా ఒక్కోరకం కేజీ ₹200 నుండి 250 వరకు విక్రయాలు జరుపుతున్నారు. ధర ఎంతైనా పర్వాలేదు కానీ మృగశిర కార్తె రోజు మాత్రం చేప ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు జనం చేపల కోసం ఎగబడుతున్నారు. రోజువారీగా 150 ఉండే ధర ఒక్కసారిగా 50 నుండి 100రూపాయలు పెంచి అమ్ముతున్నారు. మృగశిర కార్తెను మాత్రం జనాలు చేపల సందడితో ఘనంగా నిర్వహించుకుంటున్నారు.

## చదువు జీవితాన్ని వెలిగించే దీపం



(మొదటి పేజీ తరువాయి...)
కూర్చుని చదువులు సాగించారని చెప్పుకొచ్చారు. విద్యార్థులు ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని చదివిన నాడు లక్ష్యం సహకారం అవుతుందని ,కృషి పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. గ్రంథాలయాలు ప్రత్యక్ష దేవాలయాలు వంటివనీ, వాటిని సద్వినియోగం చేసుకొని మంచి వాతావరణంలో చదువుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు సదుపాయాలు కల్పిస్తుందని మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విశ్రాంత ఉద్యోగులు తమకు వచ్చే నెలవారి పింఛన్లులో మంచి సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రంథాలయాల్లో ఉన్న అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చేందుకు ముందుకు రావడం గర్వకారణం అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బ్రతుకులను బంగారు మయంగా మలుచుకోవాలని, మన ప్రవర్తన ఆధారంగానే జీవితాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయి అన్నారు ,ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు జి మణి మృదుల ,సీనియర్ సిటిజెన్ సభ్యులు ప్రెసిడెంట్ కోట్ల నాగేశ్వరరావు, సెక్రటరీ సురేష్ కుమార్, ట్రెజరర్ ధర్మరాజు, కేశవరావు విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు

## పేదల సంక్షేమానికి అండగా మోడీ ప్రభుత్వం



**టేకులపల్లి,జూన్08,ప్రజాజ్యోతి:** మండలంలో బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షులు బై రెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆదేశానుసారం మండల అధ్యక్షులు తేజావత్ శంభూనాయక్ ఆధ్వర్యంలో ఆదివారం వికసిత్ భారత్ అమృత కాలం,సేవ, సుపరిపాలన,పేదల సంక్షేమానికి మోడి ప్రభుత్వం విజయవంతంగా 11 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన అధికార ప్రతినిధి భూక్య శ్రీను నాయక్ హాజరై. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ 11 ఏళ్లలో జరిగిన అభివృద్ధితో పాటు పహల్గవ్ ఉగ్రదాదికి ప్రతీకారంగా మోడి ప్రభుత్వం చేసిన సిందూర్ ప్రతిదాడిని కేవలం ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్స్ సహాయంతో పాక్ పై సాధించిన విజయం గురించి వివరించారు.అలాగే గ్రామాల్లో,పట్టణాల్లో పార్టీ బలోపేతం పై విషయావాహగన కల్పించారు.మండలం సినియర్ నాయకులు ధారావత్ ద్రావ్ సింగ్,చిక్క వెంకటేశ్వర్లు,వెంకటేశ్వర్లు.ఈ కార్యక్రమంలో మాజీ మండలం అధ్యక్షులు బాలాజీ నాయక్,ఇల్లందు నియోజకవర్గ నాయకులు హతీరం నాయక్,పూన్య నాయక్,మండల ,ప్రధాన కార్యదర్శి నాగేందర్,కార్యదర్శి లక్పతి నాయక్, వినోద్,రాందాస్,బాల,రాజు,నవీన్ , జమాల్,అప్పారావ్ మహిళా నాయకులు గంగా పాల్గొన్నారు.

# కలెక్షన్ ఫుల్... పార్కింగ్ ప్లేస్ నిల్

(మొదటి పేజీ తరువాయి...)
కారుకి 100రూపాయలు. 100రూ తీసుకోవలసిన పెద్దకారుకి 150రూపాయలు వసూల్ చేస్తున్నారు. ఏమన్నా అంటే దురుసు ప్రవర్తన చేసేది ఏమీ లేక అంత దూరం నుంచి వచ్చాము కాబట్టి తప్పదు అని భక్తులు వాపోతున్నారు. ఆలయం చుట్టుపక్కల పార్కింగ్ ప్లేస్ చాలక రోడ్ల పైన పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సామాన్య భక్తులు నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల రోజు వారి పనులకు వెళ్లే భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున భద్రాచలం దర్శనానికి వచ్చే రామ భక్తులకు సరైన పార్కింగ్ సదుపాయం దేవస్థానం వారు ఏర్పాటు చేయాలని రామభక్తులు కోరుకుంటున్నారు.

## ఏజెన్సీలోతిరిగి కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలి



**ఇల్లందు, జూన్ 8, ప్రజాజ్యోతి:** ఏజెన్సీలోతిరిగి కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలని గీతా పనివారల సంఘం రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం,రాష్ట్ర ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు కోరారు. ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లానుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరకు ఏజెన్సీ ప్రాంతంలో జీవిస్తున్న కల్లుగీత పనివారాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, వృత్తిరీత్యా చెట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మరణించిన వారికి కనీసం బీమా సౌకర్యం కూడా అందడం లేదన్నారు. గిరిజన చట్టాలకు కల్లుగీత వృత్తికి ఎటువంటి సంబంధం లేకపోయినా గతంలో ఒక గిరిజన నాయకుడు కక్షపూరిత చర్యలతో ఏజెన్సీలో ఉన్న కల్లుగీత సొసైటీలను రద్దుచేయించారని, అందువల్ల గత 25 సంవత్సరాలుగా గీత వృత్తి చేసుకునే గౌడ కులస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరులైన ఇతర కులస్తులకు సొసైటీలు ఉండి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు పొందుతున్నప్పుడు గీత వృత్తి చేసుకునే గౌడ కులస్తులకు మాత్రం ఎందుకు సొసైటీలను రద్దు చేశారని పేర్కొన్నారు. సొసైటీలను తిరిగి పునరుద్ధరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో గీతా పనివాళ్ల సంఘం జిల్లా నాయకులు బంధం నాగయ్య, బంధం నాగేశ్వరరావు, ఇల్లెందు ఏరియా సంఘం నాయకులు బజార్ ఆంజనేయులు గౌడ్, మరీదు నాగరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 3వ ఇంక్లైన్ గ్రామ పంచాయతీ లో అంగరంగ వైభవంగా బొడ్రాయి పండుగ



**చంచుపల్లి, జూన్ 8(ప్రజా జ్యోతి):** 3వ,ఇంక్లైన్ గ్రామపంచాయతీలో అంగరంగ వైభవంగా బొడ్రాయినీ పూజారులు ఊరు మధ్యలో ప్రతిష్టించడం జరిగింది. పట్టణంలో గాని, గ్రామంలో గాని బొడ్రాయి లేని ఊరు అంటూ దాదాపు ఉండదు, ఎందుకంటే బొడ్రాయి వున్నా గ్రామాలలో సుఖసంతోషాలతో, అష్ట ఐశ్వర్యలతో ఉంటారు.ఊరిలో ఎటువంటి దుష్ట శక్తులు, క్షుద్ర శక్తులు, అకాల మరణాలు, సంభవిచకుండా ఈ యొక్క బొడ్రాయి అంగరక్షకుడిగా ఉంటుంది అని గ్రామస్తులు విశ్వసిస్తారు.3వ ఇంక్లైన్ గ్రామ పంచాయతీకీ చెందిన ఒక ప్రధాన రాయినీ తాళా మేళలతో,డప్పు వాయిద్యాల అంగరంగ వైభవంగా ఊరు మధ్యలో ప్రతిష్టిచడం జరిగింది.బొడ్రాయి ముందు మేక ను సాంప్రదాయం పద్దతిలో బలి ఇవ్వడం జరిగింది.ఇలా మేకను బలి ఇచ్చేపద్ధతిని తెలుగు భాషలో 'గో'పట్టం, అని పిలుస్తారు. ఊరు పుట్టుక చెప్పే గుర్తు బొడ్రాయి. గ్రామా ప్రజలు ఈ పండుగలో పాల్గొని విజవంతం చేయడం జరిగింది.

## నేడు ఐటీడీఏలో గిరిజన దర్భార్

**భద్రాచలం, జూన్ 8(ప్రజాజ్యోతి ):** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్భార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం తెలిపారు. ఈ గిరిజన దర్భార్ ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో జరుగుతుందని, అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించి అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు.

## భద్రాద్రి @41.9

**భద్రాచలం, జూన్ 8 (ప్రజాజ్యోతి):** ఈ ఏడాది కాస్త ముందుగా వచ్చిన రుతుపవనాలతో ఎండలు తగ్గాయని భద్రాచలం డివిజన్ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భద్రాచలం డివిజన్ లో శనివారం,ఆదివారం రెండు రోజులు 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం డివిజన్ లోని 3 మండలాలలో పైగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా భద్రాచలం పట్టణంలో కేంద్రంతో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.శని ,ఆదివారాలు సెలవు దినం కావడంతో భద్రాద్రి కి రామభక్తులు ,పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది .దింతో రామభక్తులు ,పర్యాటకులు వామ్మో ఏంటి ఈ ఎండ అంటూ భయపడిపోయారు

- **వారం రోజులుగా ఉక్కపోత**

ఎండవేడిమికి తోడు ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోహిణీ కార్తె ముందు రెండురోజులు చల్లదనం ఉండగా, మిగతా రోజులు ఉక్కపోత నెలకొంది. మిట్టమధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం ఆరు దాటుతున్నా ఉక్కపోత, వడగాడ్పులు తగ్గడం లేదు.

## కన్నులపండువగా రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , జూన్ 8(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన అర్చకులు జరిపారు. అంతరాలయంలోని ధృవ మూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు,నిత్యబలిహరణం,నిత్యపూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు.కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## నీటి సమస్యను పరిష్కరించండి





**టేకులపల్లి,జూన్08,ప్రజాజ్యోతి :** మండలంలోని గోల్యాతండా పంచాయతీ సంత వీధితో పాటుగా హరిజనవాడ,గుగులోత్ చంద్రు వీధిలో గత ఇరవై రోజులుగా నీటి సమస్య నెలకొంది. పశువుల సంత ప్రాంగణంలోని గోల్యాతండా భగీరథ ట్యాంక్ ఔట్లెట్ పగిలి నీళ్లు వృధాగా పోతున్నాయి. దీంతో నీళ్లు సమీప వీధుల్లోని ఇళ్లకు చేరడం లేదు. డీపీ సిస్టమ్ బోర్ ఉన్నప్పటికి ఫీజులు, ఎంసీబీ లేక పోవడంతో నిరుపయోగంగా ఉన్నదని కనీసం డీపీ సిస్టమ్ అయినా వినియోగంలోనికి తీసుకవస్తే నీళ్ల ఇబ్బందులు తొలగిపోతాయని తక్షణమే పంచాయతీ, భగీరథ అధికారులు కలుగజేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై గోల్యాతండా పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా.. మిషన్ భగీరథ ట్యాంక్ ఔట్లెట్ పగిలిపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానని తెలిపారు.

# వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి లభించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన బూర్గుల విజయభాస్కర్( బాచి)



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 8, ప్రజా జ్యోతి** మంత్రివర్గ విస్తరణలో భాగంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి లభించడం పట్ల పాల్వంచ కు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి మాల విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకులు విజయభాస్కర్,( బాచి) హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో గడ్డం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి లభించడం అభినందనీయమని, మంత్రి వెంకటస్వామి హైదరాబాదులో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తాను హాజరై సన్మానించినట్లు తెలిపారు, తెలంగాణ ఉద్యమంలో అహర్నిశల పోరాడిన వ్యక్తి వివేక్ వెంకటస్వామి అని, ఆయన నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకునికి మంత్రి పదవి కల్పించడం హర్షించదగ్గ విషయం అన్నారు, వెంకటస్వామికి మంత్రి పదవి కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సోనియా గాంధీ ,రాహుల్ గాంధీ లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు చైతన్య, తప్పుడు శివకుమార్ లు పాల్గొన్నట్లు తెలిపారు.

## పాల్వంచ అభివృద్ధి కోసం పోరం ఫర్ బెటర్ పాల్వంచ అహర్నిశలు కృషి చేస్తుంది



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 8, ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణ అభివృద్ధిపై, కార్పొరేషన్ ఏర్పాటుపై ఆదివారం పాల్వంచలోనే స్థానికబృందావన్ హోటల్లో ఫోరమ్ ఫర్ బెటర్ పాల్వంచ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నూకుల రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్వంచ పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ "పాల్వంచ పట్టణానికి పునర్వైభావానికి ప్రజాప్రతినిధుల మీద ఒత్తిడి తెచ్చే బాధ్యత ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ తీసుకుంటుందని, పాల్వంచ పట్టణంలో నూతన 800 మెగా వాట్ పవర్ ప్లాంట్ స్థాపన, ఎన్ఎండిసి పునర్వ్యవస్థీకరణ, పట్నానికి వివిధ కేంద్రీయ విశ్వ విద్యాసంస్థలస్థాపన, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు, పాల్వంచ పట్టణానికి చెందిన పట్టణానికి మౌలిక సదుపాయాలు కల్పన వివిధ ప్రాజెక్టులు చేపట్టాలని , ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకునేటప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలతోని, వివిధ రాజకీయ పార్టీలతోని ప్రజా సంఘాలతోని వివిధ అసోసియేషన్లతోని చర్చించి నిర్ణయం తీసుకోవాలని, పాల్వంచ పరిశ్రమలకు అనువైన ప్రదేశం. పాల్వంచ కరకవాగు ప్రాంతంలో రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని ,కిన్నెరసాని అభివృద్ధి చేసి జూ పార్క్ ఏర్పాటు చేయాలని ,త్వరలో పాల్వంచ పట్టణంలో ప్రజల సందేహాలని నివృత్తి చేయడానికి స్థానిక ఎమ్మెల్యే , అధికారులతోనూ సమావేశం నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు పాల్వంచ అభివృద్ధి కోసం ఫోరమ్ ఫర్ బెటర్ పాల్వంచ రాజీ లేని పోరాటం చేస్తుందని ,పర్యాటక రంగపరంగా పాల్వంచని అభివృద్ధి చేసి టూరిజం హబ్ గా తీర్చిదిద్దాలన్నారు, ఈ కార్యక్రమంలో ముంతపురి రాజు గౌడ్, కాల్వ భాస్కర్, బుడగం రవి, కాపా కృష్ణమోహన్, వై.సాంబశివరావు, జమాల్ సైదులు, కట్టా వెంకట నారాయణ, కళ్యాణం లక్ష్మిపతి, పాటిబండ్ల అభినవ్, యడ్లపల్లి శ్రీనివాస్ కుమార్, బుద్ధి కిషోర్, పోనిశెట్టి వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసరావు, తులసి రామ్, ఆరుద్ర సత్యనారాయణ, సాధం రామకృష్ణ, మంజూర్, దున్నపోతుల రాజు, ఆలపాటి ప్రసాద్, నగేష్, చేనుమోలు శ్రీను, సాంబశివరావు, జైన్ కుమార్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కేబినెట్ లో మైనార్టీలకు మొండిచేయి
- మైనార్టీల సమస్యల పరిష్కారం కోసం మైనార్టీ మంత్రిని నియమించాలి
- మైనార్టీ జిల్లా అధ్యక్షులు యాకూబ్ పాషా



**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 8, ప్రజా జ్యోతి :** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ లో మైనారిటీలకు మంత్రి పదవి కెటాయించకుండా మొండి చేయి చూపించిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు, ఆదివారం పాల్వంచలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో యాకుబ్ పాషా మాట్లాడుతూ క్యాబినెట్లో ముస్లింలకు మంత్రి పదవి కల్పించకపోవడం విచారకరమని , ఇది మైనారిటీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు, మైనారిటీ మంత్రి లేని కారణంగా గత కొన్ని నెలలు గా అనేక మైనారిటీ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని , రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీ గురుకులాలు ఇరుకైన కిరాయి భవనాల్లో, అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని, ఇప్పటివరకు మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలలు ఏర్పాటు కానీ, మైనారిటీ స్టడీ సర్కిల్లు లేవని అన్నారు. అదేవిధంగా వక్ఫ భూముల సర్వే, వక్ఫ ట్రిబ్యునల్ ఏర్పాటు వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి వక్ఫ బోర్డు, మైనారిటీ సంక్షేమ శాఖలలో ఉద్యోగ నియామకాలు జరగలేదని, గత ప్రభుత్వం ఉర్దూ మీడియం స్కూళ్లను ఇంగ్లీష్ మీడియంగా మార్చి ఉర్దూ భాషను కనుమరుగు చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందని, ముస్లింల పట్ల చిన్నచూపు తగదని హితవు పలికారు. ఓసిలు 6, ఎస్సీలు 4, బీసీలు 3, ఎస్టీల నుండి ఒకరిని మంత్రి వర్గంలోకి తీసుకున్న ముఖ్యమంత్రికి మైనార్టీల నుండి ఒక్కరూ కనిపించకపోవటం విడ్డూరం గా ఉందన్నారు. మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు కోసం మాత్రమే ఉపయోగించుకుంటున్న కాంగ్రెస్ అదిష్టానం ఆలోచనా సరళిని మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి త్వరలో జరగనున్న క్యాబినెట్ విస్తరణలో మైనారిటీలకు సముచిత స్థానం కల్పించాలని, లేని పక్షంలో మైనార్టీల నుండి తీవ్ర వ్యతిరేఖతను చూడటం ఖాయమన్నారు. మైనారిటీల నుండి మంత్రి లేకపోవటంతో మైనారిటీల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి,అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీల సమస్యల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని విడనాడాలని యాకూబ్ పాషా ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో హుస్సేన్ ఖాన్, సలీం, గౌస్ పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సంతో ఎగిరిపోయిన రేకులు రోధిస్తున్న బాణోత్ బుచ్చి



**టేకులపల్లి, జూన్ 08,ప్రజాజ్యోతి:** గాలివాన బీభత్సంతో ఎగిరిపోయిన ఇంటి రేకులు ఆవేదనతో రోధిస్తున్న బానోత్ బుచ్చి . మండలంలోనీ సులానగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం టేకులపల్లి మండలం సులానగర్ గ్రామ పంచాయితీ బోడ తండా కు బానోత్ బుచ్చి నిరుపేద వ్యవసాయ కూలీ అయినటువంటి బానోత్ బుచ్చి ఆర్థిక ఇబ్బందులతో రేకుల ఇల్లు వేసుకొని జీవనం సాగిస్తుంది. ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి గాలివాన బీభత్సంతో రేకుల ఎగిరిపోయాయి. నిరుపేద అయినా బానోత్ బుచ్చి ఇందిరమ్మ ఇల్లు రాకపోవడం చాలా బాధగ ఉంది అని, ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు.

## మండలంలో పడకేసిన పారిశుద్ధ్య పనులు



**టేకులపల్లి, జూన్08, ప్రజాజ్యోతి:** గ్రామ పంచాయితీలలో ప్రత్యేక అధికా రుల పాలనలో మండలంలో పలు గ్రామాలలో పారిశుద్ధ్య పనులు పడకేశా యి. ఆదివారం టేకులపల్లి మండలం దాస్ తండా గ్రామంలో చాలా రోజు లుగా సైడ్ డ్రైనేజీలో పెరుకుపోయిన చెత్తతో మురికి నీరు ఇండల్లోకి చేరిన సంఘటన చోటుచేసుకుంది. వర్షా కాలం ప్రారంభం అయి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే సమయంలో ఇలా గ్రామాలలో పారిశుధ్యపనులు పడకేయటం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తరతరాల నుంచి వస్తున్న భూమికి అడ్డం ఎందుకు.?

- డబ్బులకు కక్కుర్తి పడి అయిన వారే మోసం చేస్తున్నారు.



**టేకులపల్లి,జూన్ 08,ప్రజాజ్యోతి:** మండలంలోని తడికలపూడి గ్రామానికి చెందిన ఊకే పిచ్చయ్య, ఊకే చక్రవర్తి అన్నదమ్ముల భూమిని అదే కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు ఐదు తరాల తర్వాత ఆ భూమి మాది అంటూ అడ్డం వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాన్యువల్ పానీ, ఆన్లైన్ పాని ఈ రెండు మా పేరు మీద ఉన్నాయి. గతంలో కూడా మాకు చెప్పకుండా మా చేలో ఉన్నటువంటి జమాల్ చెట్లను కూడా ఇబ్బంది పెట్టేందుకు వారు తీయించారు. ఈ భూమి మాది మా తాతకు కూడా ఇందులో వాటా ఉంది. మా తాత మీకు అమ్మ లేదు అందుకే మేము అడ్డం వస్తున్నాను. ఉకే పిచ్చయ్య, చక్రవర్తి కావాలని నా వద్ద భూమిని కజేయడం కోసం కుట్రలు పన్నుతున్నారని వారు తెలిపారు. ముమ్మాటికి మా భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని ఉకే కుటుంబం సభ్యులు ఆరోపిస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే



**భద్రాచలం, జూన్ 8(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయంలోని ఉప ఆలయాలైన అభయాంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి దేవాలయాలను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.